


# ఎ స్టోరీ ఫర్ రైటర్స్

ప్రసీలా రమణమూర్తి

జగన్నాథం నిరుద్యోగి కాదు కాని — ఒక ప్రయివేటు కంపెనీలో చిరుద్యోగి. ఒక ప్రముఖ స్థానిక దినపత్రికకు విలేఖరి కూడాను. ఆ ఊళ్లో జరిగే ముఖ్యమైన కార్యక్రమాలు గురించిన తాజా కబుర్లు సేకరించి పంపడమే స్థానిక విలేఖరిగా తను చేయాల్సిన పని.

"నమస్కారం సాబ్!"

"ఎవరూ?..." అంటూ తలెత్తి చూశాడు జగన్నాథం.

"నువ్వటోయ్, రామం! అప్పుడే వచ్చేశావా న్యూస్‌కోసం!? ఒక పది నిముషాలు ఆగావంటే ఫెయిర్ కాపీ ఇచ్చేస్తా!" అంటూ కలం, పేపరు అందుకున్నారు—జగన్నాథం.

"అలాగేనండీ!" అంటూ రామం అనే ఆ కుర్రవాడు ప్రక్కనే ఉన్న బెంచీమీద కూర్చున్నాడు.

పది నిముషాల్లో న్యూస్‌తో పాటు ఆ కుర్రాణ్ణి పంపించేసి ఆరోజు పేపరు చూడసాగారు జగన్నాథం.

"నమస్కారమండీ!" అంటూ రత్నాజీ గారొచ్చి తన కెదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నారు.

నవ్వుతూ ప్రతి నమస్కారం చేశారు జగన్నాథం.

రత్నాజీ అసలు పేరు సుబ్బారావు. తన పేరుతనకే నచ్చకపోవడంతో 'రత్నాజీ'గా తను మారిపోయారు. సుబ్బారావు ఉరఫ్ రత్నాజీ రచయిత కూడాను.

ఎప్పుడూ కథలు రాయాలన్న ధ్యాసేనే తను కాలం గడుపుతున్నా—తను రాసిన కథలు అప్పు డప్పుడు కొన్ని పత్రికల్లో మాత్రమే ప్రచురణకు నోచుకుంటున్నాయ్.

తన కథలు వివిధ వార, మాస పత్రికల్లో చోటు చేసుకోకపోవడానికి కారణం—రత్నాజీ వింత మన స్తత్వమే! వారు అందరిలా అన్ని పత్రికలకు పంపరు, విధిగా పారితోషికం ఇచ్చి—రచయితల్ని ప్రోత్సహించే పత్రికలు మనకు బహుకొద్ది మాత్రమే! ఎక్కువ పారితోషికం ఇచ్చే పత్రిక లకే తను కథలు పంపిస్తే బావుంటుంది—ఇదీ రత్నాజీ అన్ని పత్రికలకు కథలు పంపకపోవ డానికి కారణం! రత్నాజీ యాభయ్యోపడిలో పడబోతున్నా తనింకా మంచికథలు రాసి — మంచి రచయితగా గుర్తింపబడాలని — పేరు ప్రఖ్యాతులు గడించాలని వారెప్పుడూ ఆశి స్తున్నారు. తహతహలాడిపోతున్నారు. జగన్నాథం చూపులు ఇంకా పేపరుమీదే ఉన్నాయ్.

"కొత్త పత్రికల వాళ్ళు కథల పోటీ లంటున్నారు. నా దగ్గర పద్నాలుగు సరిక్రొత్త దీముక్వన్నాయ్. మూడు పత్రికలు కథల పోటీలు పెట్టాయ్. రాసి పంపమంటారా జగన్నాథంగారూ?"

"మూడు పత్రికలకూ పంపిస్తే ఏ ఒక్కదాని కైనా చాన్సుంటుందనా?"

"అవునండీ! మంచి క్వాలిటీ తెల్ల కాగితాలు నాలుగు దస్తాలు కొన్నాను. రూళ్ళు గీకి మూడు కథలు జాగ్రత్తగా రాస్తాను. ఆ తర్వాత మూడు మూళ్ళు తొమ్మిది కాపీలు తీసి— మూడు పత్రికలకు పంపిస్తాను. ఏ పుట్టలో ఏ పాముందో ఎవరు చెప్పగలరు? ఒకరికి నచ్చని కథ మరొకరికి నచ్చవచ్చు!"

"అంటే!? ఒకే కథను ఒకేసారి మూడు పత్రికలకు పంపిస్తారన్నమాట!?" పేపర్లోని మరో పేజీ తిరగేస్తూ ఆశ్చర్యంగా అడిగారు జగన్నాథం.

"అవునండీ!" రత్నాజీ.

"ఒకవేళ మీరు పంపే కథ ఒకేసారి మూడు పత్రికలూ ప్రచురిస్తే మీకూ, వారికి ఇబ్బంది కదండీ?"

"అబ్బే! అలా ఎప్పుడు జరుగదండీ! ప్రతి సారీ నే నలానే చేస్తున్నాను. ఇంతవరకు అలా జరగంది—ఇప్పుడెలా జరుగుతుందండీ? అంతెం దుకు? క్రిందటిసారి అయిదు కథల్ని...."

"అయిదు మూళ్ళు పదిహేను చేసి పంపించా రంటారు. అంతేనా?"

"అవునండీ! కాని...ఏ కథకి చాన్స్ తగల్లేదు."

"రత్నాజీగారూ! ఇప్పటికైనా మూడు మూళ్ళు తొమ్మిది—అయిదు మూళ్ళు పదిహేను పద్ధతికి స్వస్తి చెప్పండి. రాసే ఒకటో—రెండో కథల్ని జాగ్రత్తగా అన్ని కోణాలనుంచీ ఆలోచించి మరీ రాయడం చేయండి."

"మా భలేవారండి మీరు!? ఇంతవరకూ పడిన నా కథలు ఈ పద్ధతి ప్రకారమే వెలుగు లోకి వచ్చాయ్."

"స్వరే మీ ఇష్టం! ఇంతకీ ఈ వారం పత్రికలోని 'పైలా పచ్చీసు' కథ చదివారా మీరు?"

"లేదండీ! నాకు పుస్తకాలు చదివే అలవాటు అంతగా లేదండీ!"

"అలా అంటే ఎలా? రాసే ప్రతివారు విధిగా సాధ్యమైనంతవరకు ఎక్కువ సాహిత్యాన్ని చదవడం అలవాటు చేసుకోవాలి. ప్రస్తుత సాహిత్యం ఎలా ఉంటుందో? అన్న విషయం తెలుసుకోవడానికి ప్రయత్నం చేయాలి. మంచి రచనలు చదవడంవల్ల రచయిత మానసికంగా ఎదగడానికి చాలావరకు అవకాశం ఉంటుంది."

"నా కథలు మంచివి అన్న నమ్మకం నా కుందండీ. అలాంటప్పుడు ఇతర కథలు చదవడం శుద్ధ టైం వేస్ట్".

"అలానా? మంచి కథంటే ఏవిటో?" సాలోచనగా అడిగారు.

"జగన్నాథంగారూ! నిజం చెప్పాలంటే ఈ రోజుల్లో వస్తున్న కథలన్నీ నాలుగు డబ్బుల కోసం రాస్తున్న కథలండీ! అలాంటప్పుడు మంచేవిటి, చెడేవిటి?"

"అలాని కొట్టి పారేయకండి. కొంతమంది కేవలం తమ రచనలు నాలుగు డబ్బులు సంపాదించడవే ప్రధాన లక్ష్యంగా కాకుండా తమ రచనల ద్వారా నేటి సమాజంలోని అజ్ఞానాన్ని, అంధకారాన్ని, అమాను షత్వాన్ని, కుళ్ళుని సాధ్యమైనంత వరకు తగ్గించ డానికి ప్రయత్నిస్తున్నారు. నిజమైన రచయిత చేయాలిసింది, ఆలోచించాలిసిందీ అదే కదండీ?"

"అదంతా వట్టి భ్రమండీ! నా మట్టుకు నే నెప్పుడూ అలా అనుకో లేదు. ఏదో సరదా కోసం

రాస్తారన్నదే నా అభిప్రాయం. నేనే కాదు. చాలామంది అభిప్రాయంకూడా ఇదే! ఏదో రచనల ద్వారా మనవాళ్ళు సమాజాన్ని దేశాన్ని ఉద్ధరింపచేయగలిగితే మనం, మన పరిసరాలు, మన సమాజం—తద్వారా దేశం ఎప్పుడో బాగుపడి ఉండేది. రాతలో కనిపించే రంగుల ప్రపంచం వాస్తవంలో కనిపించాలనుకోవడం వట్టి భ్రమ!"

"రచయిత రచనలకి ఆలోచనలకి కనీసం తన్నైనా కట్టుబడి ఉండకపోతే ఎలా చెప్పండి?" జగన్నాథం ఆశ్చర్యంగా అడిగారు.

"రాయడం వేరు. జీవితం వేరు. పత్రికల వాళ్ళు వేస్తున్నారు కనక మా లాంటి వారు రాస్తున్నారు."

"అంతేనా? ఒక వేళ వాళ్ళు మీ రచనల్ని ప్రచురించక పోతే?"

"ఏముంది? వాళ్ళకి నచ్చే విధంగా రాసి పంపి స్తాం."

"వాళ్ళకి నచ్చే విధంగా రాయడానికి మీ అభి ప్రాయాల్ని వెంటనే మార్చేసుకుంటా రన్నమాట?"

"అంతే కదండీ!"

"ఈ మధ్య మీరేమైనా కథలు చదివారా?" తనకు చదివే అలవాటు లేదని తెలుసుండికూడా ఆ ప్రశ్న వేసినందుకు తనను తనే నిందించుకున్నారు జగన్నాథం మనస్సులో.

"మీకు మొదటే చెప్పాను. నే నెవరి కథలూ చదవనని. అయినా అప్పుడప్పుడు పుబుసుపు పోనప్పుడు ఒకటి అరా చదువుతుంటాను. ఈ మధ్య ఒక కథ చదివాను. కథ పేరు సరిగ్గా గుర్తు లేదు కాని రాసింది 'మూర్తిశ్రీ' అన్న కలం. ఈ మధ్య తన రచనలు చాలా వస్తున్నాయ్. ఆ కథలో ఏముంది చెప్పండి? ఆకలి కేకలు తప్పిస్తే! ఆ రచయితను అన్ని పత్రికలు ఎంతో పైకి ఎత్తేస్తున్నాయ్. అసలు న న్నడిగితే ఆ కథంత చెత్త కథ మరొ టుండదండీ!"

"మరీ అలా తీసి పారేయకండి! మీకు, నాకు కనిపించని అందాలు ఆ కథలో సంపాదకులకు కనిపించి ఉండొచ్చు."

"సర్లెండి! మీకు అసలు విషయం చెప్పడం మరిచాను. ఆ మధ్య నేను 'సాహితి' మాసపత్రికకు నా 'వాడని మల్లెలు' నవల పంపాను గుర్తుందాండీ?"

జగన్నాథంగారో మారు చేతి వాచీ చూసుకుంటూ కాస్త చికాగ్గా అన్నారు: "అవునండీ! పంపినట్లు ఈ మధ్య ఒక పది సార్లు చెప్పి ఉంటారు. ప్రచురణ కైనా స్వీకరించారా?"

"వాళ్ళకి నా నవలెందుకు నచ్చుతుందండీ? ఆ మూర్తిశ్రీగాడిలాంటి వాళ్ళవైతే చదవకుండానే బహుమతులు ఇచ్చేస్తారు."

"అయ్యా, రత్నాజీగారూ! ఈ విషయంకూడా తమరు చాలా సార్లు నాకు గతంలో మనవి చేశారు."

"అవుననుకోండి. ఈ మధ్య తరచు ఆ మూర్తిశ్రీ గాడి రచనలు వస్తున్నాయ్ గదండీ? అవి ఇంగ్లీషు వాటికి కాపీలా ఉన్నాయండీ!"

"అసలు మీరెప్పుడైనా ఇంగ్లీషు నవలలు గాని, కథలు గాని చదివారా? మన కథలే చదవని మీరు ఆ మూర్తిశ్రీ రచనలు ఇంగ్లీషు వాటికి

---

ముని

— ఎం. శివసంకరయ్య



'కాపీ' అని ఎలా చెప్పగలుగుతున్నారు?"

"దాందేవుందండీ. ఇంగ్లీషు వాళ్ళు తప్పించి మన వాళ్ళంతమంచి కథలు కథలు రాయగలరటండీ?"

"అంటే? మీ రొక విధంగా ఆ మూర్తి శ్రీ రచనలు బాగున్నాయని ఒప్పుకుంటున్నారన్నమాట?"

"వాడి గొడవ మన కెందుకు లెండి. ఆ సాహితి పత్రికల వాళ్ళకు నా నవల నచ్చలేదంటండీ!"

"రత్నాజీగారూ! మీ నవల గురించి మరోసారి ముచ్చటించుకుందాం. నాకవతల చాలాపనులున్నాయ్" విసుగ్గా అన్నారు జగన్నాధం.

"అయితే వస్తానండీ! వీలుంటే సాయంత్రం మళ్ళీ కలుస్తానండీ! ఈ రోజెలాగూ ఆదివారమే కదా?"

"బహుశా సాయంత్రం నేను ఇంట్లో ఉండక పోవచ్చండి."

"ఫరవాలేదండీ! మీరు లేకుంటే ఎలాగూ తప్పదు వెళ్ళి పోవడం. ఒక వేళ ఉంటే నా నవల గురించి మాటాడుకుందాం" అంటూ రత్నాజీ తన చేతి సంచి, గొడుగుతో సహా నిష్క్రమించారు.

"హమ్మయ్య! ఏం మనిషిరా బాబూ? పట్టు కుంటే జలగలా వదలడు. ఇలాంటి వాళ్ళను మూర్ఖు లనుకోవడం కేవలం అవివేకం" అనుకుంటూ, నిట్టూర్చారు జగన్నాధం.

"ఏవండోయ్, జగన్నాధంగారూ! మన రమణమ్మ గారొస్తున్నారు" అంటూ రత్నాజీ మళ్ళీ వచ్చారు.

"నమస్కారమండీ" అంటూ రమణమ్మగారు వచ్చారు.

రత్నాజీకి సాహిత్యం గురించి ఎలాంటి అభిప్రాయాలు ఉన్నాయో తెలుసుకోవడం కోసం మొదట ఓపిగ్గా తనతో మాట్లాడినా ఆ తరవాత తన నెలాగో వదిలించు కోవాలనుకున్న జగన్నాధం వదిలించుకో గలిగినందుకు సంతోషిస్తున్న జగన్నాధం ఈ సారి వీళ్ళిద్దరినీ చూసి హతాశు లయ్యారు.

తనా రోజు విలేఖరిగా న్యూస్ సంపాదించడం కోసం వెళ్ళాల్సిన కార్యక్రమాలు చాలా ఉన్నాయ్. ఈ సారి వీళ్ళిద్దరి మధ్య తను చిక్కుకుంటే బయ టకు వెళ్ళడమనేది వట్టి మాట!

ప్రతి సారీ వీళ్ళ రాక తన పనులకు భంగకరంగా ఉంటోందన్న విషయం వీళ్ళకు అర్థమయేలా ఎలా చెప్పడం? అప్పటికే ఎన్నోసార్లు మాటల ద్వారా తన అసహనాన్ని అయిష్టాన్ని వెలిబుచ్చాడుకూడా. గ్రహించరేం? ఆ మాత్రం ఇంగితజ్ఞానం లేని వీళ్ళు కథ లెలా రాస్తున్నారో? ఎదుటి మనుషుల్ని అర్థం చేసుకోలేని వీళ్ళా రచయిత లేనా ?

"ఏమిటండీ? ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్న ట్లుందీ?" రమణమ్మ.

"మీ గురించేనండీ!" సీరియస్‌గా అన్నారు జగన్నాధం.

"మా గురించా!"

"ఏమిటిలా వచ్చారు?" జగన్నాధం.

"నిన్న సాయంత్రం మా వాళ్ళ పెళ్ళికి వెళ్ళానండీ అందుకనే మిమ్మల్ని కలియ లేకపోయాను. ఈ రోజు ఆదివారం కదాని ఇలా వచ్చాను." రమణమ్మ.

"మీతోబాటు రోజా పెళ్ళిళ్ళకు రత్నాజీగార్ని కూడా తీసుకు వెళ్ళితే చాలా బాగుంటుందండీ!"



శిల్ప సుందరి

చిత్రం — ఎస్. ఎం. రామ,

"నాతోబాటు వారెందుకండీ?"

"నన్ను బతికించడానికి."

"అదేమిటండీ? వింతగా మాటాడుతున్నారు?" రత్నాజీ, రమణమ్మ కలిసి ఆశ్చర్య పోయా రొకేసారి.

"మీ లాంటి రాసే వాళ్ళు పది మంది మనుషు లున్న చోటుకి వెళితే వాళ్ళ మనస్తత్వాల్ని ఆకళింపు చేసుకుని మంచి మంచి కథలు రాస్తే మా లాంటి వాళ్ళు మీ లాంటి వాళ్ళు రాసే కథలు చదువుకుంటూ బతకొచ్చని!" జగన్నాధం.

"అబ్బ! మీరు భలే తమాషాగా మాట్లాడు తున్నారే? కథంటే గుర్తొచ్చింది. నిన్న పెళ్ళిని ఆధా రంగా తీసుకుని మంచి కథ రాద్దామనుకుంటున్నాను. సగం కథ రాత్రికి రాత్రే రాసేశాను. మిగతా కథ రాత్రికి రాసేస్తాను."

"రమణమ్మగారూ! కిందటి సారి మనం కలుసు



కున్నప్పుడు ఏదో నవల రాస్తున్నట్టు చెప్పారు. పూర్తయిందా?" రత్నాజీ .

"నవలంటే గుర్తొచ్చిందండీ! కిందటి సంవత్సరం ఒక ప్రముఖ పత్రిక పెట్టిన సినిమా కథల పోటీకి నా నవల పంపించాను. గుర్తుందాండీ?" రమణమ్మ.

"గుర్తుండకేం? మీరు పంపించినట్లు ఇప్పటికి సుమారొ పాతిక సార్లు చెప్పి ఉంటారు. ఆ నవలలో సగం ఒక ప్రముఖ సినిమా రచయిత కాపీ కొట్టేసి 'సరి సరి అవ్వా!' అన్న సినిమా తీసి బాగా డబ్బులు చేసుకున్నట్టుకూడా మీరు చెప్పారు".

ఎంతో అసహనంగా చికాగ్గా అన్నా జగన్నాధం మాటల్ని పట్టించుకోలేదు రమణమ్మ.

"ఇప్పుడేం జరిగిందో మీకు తెలుసాండీ"?

"మీ నవలలో మిగతా సగం మరొక రెవరైనా కాపీ కొట్టేశారా ఏమిటి?" హేళనగా అడిగాడు జగన్నాధం.

"అక్షరాల అంతే జరిగిందండీ! సర్వం జగన్నాధం సినిమా వచ్చింది. ఆ సినిమాలోని ప్రతి అక్షరం నా నవల్లోదే! నా నవల్లో హీరో హీరోయిన్లకి రెండు పాటలుకూడా రాశాను. ఆ పాటలుకూడా కాపీ కొట్టేశారండీ!"

"నిజంగానా?" రత్నాజీ ఆశ్చర్య పోయారు.

"ఎవరినైనా మంచి లాయర్ని పెట్టి కోర్టు కేసు బనాయించండి. అప్పుడు మీకు న్యాయంజరగొచ్చు." వ్యంగ్యంగా జగన్నాధం.

"పోన్లెద్దురూ! నా వల్ల వాళ్ళు బాగు పడు తున్నారు. నా నవల నా పేరుతో కాకపోయినా తెర కెక్కింది. నా కంతే చాలు!"

జగన్నాధంకి మనస్సులో మండుతున్న సభ్యత కోసం మౌనం వహించారు.

"ఏమిటండీ ! అలా ముభావంగా ఉన్నారు!?" రమణమ్మ.

"మధ్యలో మీ మాటల్ని ఆపడమెందుకని !" జగన్నాధం.

"ఈ వారం పత్రికలో మూర్తి శ్రీ గారి కథ చదివారండీ?"

"చదివానండీ ! మీరాకముందు రత్నాజీ గారిని అడిగాను—మీరా కథ చదివారా?అని" జగన్నాధం.

"రత్నాజీగార్ని అడగడం శుద్ధ దండగలెండి. వారు వారి కథలు తప్ప మిగతా కథలేవీ చదవరుగా!"

"ఇంతకీ ఆ కథ మీకు నచ్చిందా?" జగన్నాధం.

"నాలుగు తెలుగు వాక్యాలు రాయగల ప్రతి వాళ్ళూ కథలు రాయడం ప్రారంభిస్తే ఇలానే ఉంటుంది" రత్నాజీ.

"అంటే వారి కథ మీకు నచ్చలేదన్నమాట!?" ఆశ్చర్యంగా ఆమె.

"ఆ దీముంది చూశారూ? వట్టి దరిద్ర మంటే నమ్మండి."

"జగన్నాధంగారూ ! మీకు ఫోనొచ్చింది. ఎవరో లైన్లో ఉన్నారు" అంటూ ప్రక్క పోర్షన్‌వాళ్ళు జగన్నాధంని పిలవడంతో తను అక్కడ్నుంచి వెళ్ళారు.

ఒక అయిదు నిముషాల్లో తిరిగి వచ్చిన

జగన్నాథంకి రత్నాజీ, రమణమ్మలు తీవ్రంగా విమర్శించుకోవడం విసుగనిపించింది.

"నా కథల్ని విమర్శించే పాటివారా మీరు!?" రత్నాజీ.

"మీకంటే ఆ మూర్తిశ్రీ రచనలే వెయ్యిరెట్లు నయం!" రమణమ్మ.

"నా కథలు వాడి కథలకంటే బాగానే ఉంటాయ్, పత్రికల వాళ్ళకి ఎందుకో నచ్చటం లేదు. అయినా ఒకరి కథలతో నా కథల్ని పోల్చి నన్ను మీరు కించపరుస్తున్నారు."

"మానండి రత్నాజీగారూ! కథలు రాయడం వరకే మీ పని. పత్రికలో వచ్చిం తర్వాత ఒక పాఠకురాలిగా మీ కథల్ని విమర్శించే హక్కు నాకుంది."

"నా కథలు నా ఇష్టం వచ్చినట్లు రాస్తాను. మధ్య మీకేంటమకండీ?"

"నా ఇష్టం వచ్చినట్లు విమర్శిస్తాను. విమర్శ అను నిష్పాదయంతో స్వీకరించలేని మీరేం రచయితలండీ?"

"అదంతా మీ కనవసరం! కాస్త జాగ్రత్తగా మాటలు రానివ్వండి. ఆడవాళ్ళుకదాని వూరు కుంటుంటే మరీ మితిమీరిపోతున్నారు."

"మగాళ్ళుకదాని ఇంతసేపూ మీతో గౌరవంగా మాటాడాను. వాదే బుద్ధితక్కువ!"

"..............."

"..............."

"ఇంతసేపూ బాగానే ఉన్నారుకదా? ఇంతలోనే ఏమైంది!? కాస్త నెమ్మదిగా మాటాడండి. చుట్టుపక్కలవారు ఇప్పటికే మీ గురించి చెప్పుకు కొరుక్కుంటున్నారు" విసుగ్గా జగన్నాథం.

"జగన్నాథంగారూ! ముందు మీ కీ విషయం చెప్పండి. రెండేళ్ళక్రితం ఆ సాహితీ పత్రికల్ని వాళ్ళు జరిపిన కథల పోటీలో నా కథకు కన్సోలేషన్ బహుమతి వచ్చిందా, లేదా?" రత్నాజీ.

"వచ్చింది—ఎవరు కాదన్నారు!?" జగన్నాథం

"ఆ పత్రికలో నా ఫోటో కూడా పడింది కదా?"

"అవును."

"ఈమధ్య వాళ్ళు బహుమతి గ్రహీతల ఫోటోలు—పరిచయాలు వేయటం లేదని—అదృష్టంకొద్దీ నా ఫోటోతో వివరాలు కూడా ఆ పత్రికలో వచ్చాయని అన్నాను. ఈమాత్రం దానికి ఈవిడ రమణమ్మగారేమన్నారో మీకు తెల్సా?"

"చెప్పండి" జగన్నాథం.

"నన్నడగండి చెబుతాను. ఈ రెండేళ్ళనుంచీ సుమారు మూడొందలసార్లు తన ఫోటోపడిందని తను అదృష్టవంతుణ్ణని చెబుతుంటే వినేవాళ్ళకు బోరు కొట్టదండీ?" రమణమ్మ.

"మీరుమాత్రం మీ నవల గురించి ఇప్పటికి సుమారు ఆరేడు వందలసార్లు మమ్మల్ని బోరు చెయ్యలేదూ? మీ నవలని ప్రముఖ సినిమా రచయితలు కాపీకొట్టేసి ఒకే నవలని మూడు సినిమాలు తీశారని వాగలేదూ?"

"అబ్బబ్బబ్బ! ఎందుకండీ! మీ రిలా కరిచేసుకోవడం? మీరిలా పోట్లాడుకోవడం నాకు చాలా ఇబ్బందిగా ఉందండీ!" కోపంగా జగన్నాథం విసుక్కున్నా వారు లక్ష్యపెట్టలేదు.

"ఏమీ లేదండీ! ఎప్పుడో తన కథకు వచ్చిన బహుమతి గురించి ఫోటో పరిచయం గురించీ బోరేస్తూంటే అన్నాను — మీ ఫోటోని ఎన్లార్జి చేయించుకుని రోజూ లేవగానే తప్పనిసరిగా దణ్ణం పెట్టుకోమని!" రమణమ్మ.

వట్టి పెన్స్ ఆఫ్ హ్యామర్ లేని మనుషులు!

ఒకరి లోపాల్ని మరొకరు ఎత్తిచూపుకోడం కంటే — ఎవరి లోపాల్ని వారు గుర్తిస్తే ఎంత బావుణ్ను? ...

అప్పుడు తనకీ తద్దినం తప్పునుకదా?

"మాట్లాడ రేమండీ, జగన్నాథంగారూ!" రమణమ్మ.

"తనలా నన్ను అనొచ్చా మీరైనా చెప్పండి" రత్నాజీ!

"ఇందులో నే చెప్పేదేముందండీ? ఎవరి అభిప్రాయాలు వారివి. కానీ ఒక్క విషయం! మనం ఏం మాట్లాడినా — మన ద్వారా ఎదుటివాళ్ళు ఎలా పీలవుతున్నారో?— అన్న విషయం గ్రహించి మాట్లాడ్డం చాలా అవసరం!" జగన్నాథం.

"వీనితో మాటాడ్డం నాదే బుద్ధితక్కువ!" రత్నాజీ.

"మీతో మాటాడ్డం నిజంగా నా అవివేకం మనుండీ!" రమణమ్మ. తన ఉనికిని— తన మాటల్ని పట్టించుకోకుండా— వాళ్ళలా పోట్లాడుకుంటుంటే జగన్నాథం గారికి పీకల్దాకా కోపం వచ్చింది.

"అయ్యా, రత్నాజీగారూ! అమ్మా, రమణమ్మగారూ! మీ రింతసేపూ ఇలా పోట్లాడుకుంటూనే వోపిగ్గా పోట్లాడుకోండి. నా కవతల అర్జంటు పనులున్నాయ్. నేను వీధిలోకి పోతున్నాను" అంటూ జగన్నాథం బట్టలు మార్చుకోడానికి ప్రక్కగదిలోకి వెళ్ళారు.

"అయితే మేం మళ్ళీ కలుస్తామండీ!" అంటూ ఇద్దరూ అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

జగన్నాథం సంతృప్తిగా వూపిరి పీల్చుకున్నారు.

* * * *

జగన్నాథంకి — రత్నాజీ రమణమ్మలతో పరిచయం అనుకోకుండా కొన్నేళ్ళ క్రితం ఒక సాహితీ సభలో జరిగింది. ఆ రోజు వీళ్ళిద్దరూ చదివిన కథల మీద విమర్శ చేయకుండా ఉండలేకపోయారు తను. నాటి నుంచీ — నేటి దాకా వీళ్ళిద్దరూ జగన్నాథం గారి ఇష్టాఇష్టాలతో నిమిత్తంలేకుండా ప్రతి రోజూ తనింటికి రావడం తమ దొరణిలో సాహిత్య చర్చతో నిముషాన్ని గంటలుగా దొర్లించం చేయడం జరుగుతోంది. వీళ్ళని — వీళ్ళ వాగ్యుద్ధాన్ని చాలాకాలం నుంచీ జగన్నాథం ఎంతో వోపిగ్గా భరిస్తున్నారు—వీళ్ళ సంభాషణ తన పనులకు ఆటంకంగా ఇబ్బందిగా ఉన్నప్పటికీను.

సభ్యతకోసం మొదట వూరుకున్నా. ఈ మధ్య వీరి గొడవ — నాగుడు మరీ భరించలేనంత బాధ్యతంగా ఉండటం వల్ల వీళ్ళని ఎలా వదిలించుకోవాలా? అని తీవ్రంగా ఆలోచిస్తున్నారు.

వీళ్ళని తనిక భరించ లేడు. ఎలాగోలా వదిలించుకోవాలి. ముఖామాటం లేకుండా ఇంటికి రావద్దని చెప్పేస్తే? ... అలా నిర్మొహమాటంగా ఎలా చెప్పడం? అలా చెప్పలేడు తను! మరెలా వీళ్ళను వదిలించుకోవడం?...

ఒక గంటసేపు తీవ్రంగా బుర్ర వేడెక్కించేసు కుంటర్వాత తళతళ్లతళా ఒక పరిష్కార మార్గం మెరిసింది వారి బుర్రలో.

అవును! అలా చేస్తేనే బావుంటుంది!

తనకిక వీళ్ళ పీడ శాశ్వతంగా వదిలి పోతుంది.

* * * *

క్యాలెండర్లు ముందుకి జరిగాయి.

ఈ మధ్య కాలంలో వాళ్ళ ముగ్గురు ఒక చోటకలు కలియడం జరగలేదు. రత్నాజీ ఆఫీసు పని మీద హైదరాబాద్ వెళ్ళి రావడం — రమణమ్మ తన తమ్ముడి బాతురు పెళ్ళికి వెళ్ళి రావడం కూడా జరిగింది.

పూళ్ళుంచి తిరిగి వచ్చిన రోజునే రత్నాజీ, రమణమ్మలు అర్జంటుగా జగన్నాథంగార్ని కలుసుకోవడం కోసం వారింటికి వెళ్ళి — "జగన్నాథం గారూ! జగన్నాథం గారూ!" అంటూ తలుపు మీద దబదబ బాదసాగారు.

"ఎవరూ? .. మీరు రత్నాజీ — రమణమ్మ గార్లను కుంటాను. జగన్నాథంగారు ఇల్లు ఖాళీచేసి అప్పుడే పదిహేను రోజులు కావస్తోంది. మీరువస్తే ఈ ఉత్తరం ఇమ్మన్నారు" అంటూ పక్కపోర్షన్ లోంచి ఒకావిడ వచ్చి అందించి ఉన్న ఒక కవరు ఇచ్చింది వారికి.

ఆత్రంగా రమణమ్మ, రత్నాజీలు కవరు చించి లోపలున్న ఉత్తరం చేసి తమ మొహాల్ని పోవిచ్చారు.

"సాహితీ మిత్రులకు నమస్కారాలు.

ఇంతకాలానికి మిమ్మల్ని, మీ మనస్తత్వాల్ని పూర్తిగా అవగాహన చేసుకో గలిగాను, మీ పరిచయ భాగ్యంతో 'ఏ హౌస్ ఫర్ రైటర్స్' అన్న ఒక సెటైర్ కథ రాయగలిగి నందుకు మీకు ప్రత్యేకించి నా కృతజ్ఞతలు.

నేను ఇల్లు మారిపోవడానికి కారణం ముఖ్యంగా మీ అంతులేని సాన్నిహిత్యంతో నేను బోరు పీలవడమే! మీ గొడవ వల్ల నా పనులకు ఎప్పుడూ ఆటంకం కలగడమే! రానున్న సాహితీ పత్రికలో నా కథ మీరు తప్పక చదువుతారని తలుస్తా.

భవదీయుడు—జగన్నాథం."

ఈ మధ్య జగన్నాథం గారు అలోలా మాటాడ్డానికి కారణం ఇదన్న మాట?! ఇద్దరూ ఒకేసారి గొణుక్కున్నారు. ఆ మరుసటి నెల సాహితీ పత్రికలో బహుమతి పొందిన కథగా 'ఏ హౌస్ ఫర్ రైటర్స్' 'మూర్తిశ్రీ' పేరుతో రావడంతో ఆశ్చర్యపోయి—జగన్నాథం ఫోటోతోబాటు ప్రచురించబడ్డ పరిచయాన్ని చూసిన వాళ్ళిద్దరూ నోళ్ళు తెరిచేశారు. ఆ కథ కేవలం తమ గురించే కావడం మూర్తిశ్రీయే తా మెరిగిన జగన్నాథం గారు కావడంతో ఆశ్చర్యంతో ముక్కుమీద వేసుకున్న వ్రేళ్ళను తీయడమే మరిచారు.

*